# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..








సంపుటి : 3 | సంచిక : 29 | శనివారం 2 నవంబర్ 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# గులాబీ నేతలకు రివర్స్ పంచ్

- సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో.. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఎటువంటి అన్యాయం జరగకుండా, మూసీ నది ప్రక్షాళన పేరుతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.
- ఇప్పటికే సర్వే బృందాలు సర్వే చేయగా, నిరంతరం అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు నిర్వహిస్తూ, మూసీ పునరుజ్జీవానికి కట్టుబడి ముందడుగు వేస్తున్నారు.
- ఒక్కరోజు మాతోపాటు ఉండండి. ఈ మాటలు అంటున్నది ఎవరో కాదు మూసీ పరివాహక ప్రజలు.
- మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, బిజెపి నేత ఈటెలలనే.



హైదరాబాద్

అయ్యా నేతలారా.. మీ రాక కోసం మేము వెయిటింగ్. మీకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మీరందరూ రండి.. ఒక్కరోజు మాతోపాటు కలిసి ఉండండి. మీకోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశాం. మీరందరూ తికమక చెందకుండా.. మీకు బస ఏర్పాటు చేసిన గదుల వద్ద మీ చిత్రాలను ఉంచాం. ఇక రండి.. ఒక్కరోజు మాతోపాటు ఉండండి. ఈ మాటలు అంటున్నది ఎవరో కాదు మూసీ పరివాహక ప్రజలు. ఎవరిని ఉద్దేశించో తెలుసా.. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, బిజెపి నేత ఈటెలలనే. మూసీ పునరుజ్జీవం కోసం తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించి, అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసుకున్న విషయం తెలిసిందే. సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో.. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఎటువంటి అన్యాయం జరగకుండా, మూసీ నది ప్రక్షాళన పేరుతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు ఇప్పటికే సర్వే బృందాలు సర్వే చేయగా, నిరంతరం అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు - మిగతా3లో



## బీఆర్ఎస్ హయాంలో విద్య వ్యవస్థ నాశనమైంది

- పంచాయతీరాజ్ గిరిజన అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క విసుర్లు
- విద్యా శాఖకు కేసీఆర్ ప్రభుత్వం చేసింది శూన్యం
- విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు
- ఏడేళ్లుగా ధరలు విపరీతంగా పెరిగాయి
- అందుకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ ఛార్జీలు ఎందుకు పెంచలేదు

హైదరాబాద్

బీఆర్ఎస్ హయాంలో విద్య వ్యవస్థ నాశనమైందని పంచాయతీరాజ్ గిరిజన అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క విమర్శలు చేశారు. విద్యా శాఖకు కేసీఆర్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. విద్యార్థుల బాధలు తెలిసిన రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ఉద్ఘాటించారు. అందుకే ఎన్నడు లేని విధంగా హాస్టల్, గురుకుల విద్యార్థులకు - మిగతా3లో




## 'వర్డ్ ఆఫ్ ది ఇయర్ 2024'గా కొత్త పదం 'బ్రాట్'

- విశ్వాసం, స్వతంత్రత, సుఖాలు కోరుకునే వైఖరి అనే అర్థాలిస్తున్న పదం
- 2024లో ఎక్కువ మాట్లాడుతున్న పదాల్లో ఒకటని పేర్కొన్న కాలిన్స్ డిక్షనరీ
- యూకే సింగర్ చార్లీ ఆల్బమ్‌లో వాడిన పదానికి డిక్షనరీలో చోటు

# తెలంగాణలో మయోనైజ్ బ్యాన్

- ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెస్తున్న మయోనైజ్‌ను రాష్ట్రంలో నిషేధిస్తూ తెలంగాణ వైద్యారోగ్య శాఖ కీలక ఉత్తర్వులు
- ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ
- రాష్ట్రంలో పలు హోటళ్లు, ఫుడ్‌స్టాళ్లలో తరచూ ఎంక్వైరీలను చేయాలని సంబంధిత అధికారులకు కీలక సూచనలు
- రాష్ట్రంలో నూతనంగా 3 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 5 మొబైల్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలి




హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెస్తున్న మయోనైజ్‌ను రాష్ట్రంలో నిషేధిస్తూ తెలంగాణ వైద్యారోగ్య శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేయనున్నారు. రాష్ట్రంలో పలు హోటళ్లు, ఫుడ్‌స్టాళ్లలో తరచూ ఎంక్వైరీలను చేయాలని సంబంధిత అధికారులకు ఈ సందర్భంగా మంత్రి కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో నూతనంగా 3 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 5 మొబైల్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని దామోదర రాజనర్సింహా ఆదేశించారు. కల్తీ ఆహారపదార్థాల్ని తీసుకొని పలువురు తీవ్ర అనారోగ్యం పాలవుతోన్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని - మిగతా3లో




## తెలంగాణకు కొత్త సీఎం కన్ఫామ్

- బీజేఎల్పీ నేత సంచలన కామెంట్స్
- కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డికి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు
- 2025 జూన్ నుంచి డిసెంబర్‌లోగా తెలంగాణకు కొత్త ముఖ్యమంత్రి రాబోతున్నారని జోస్యం
- కేరళలో ప్రియాంక గాంధీ నామినేషన్ వేసేటప్పుడు వెళ్లినా.. రేవంత్‌ను రాహుల్ గాంధీ కలవలేదు.




## అక్టోబరులో రికార్డ్ స్థాయిలో జీఎస్టీ వసూళ్లు

- రూ.1.87 లక్షల కోట్లుగా నమోదు
- గత ఏడాదితో పోలిస్తే పోలిస్తే 8.9 శాతం, గత నెలతో పోలిస్తే 8.1 శాతం వృద్ధి నమోదు
- రూ.33,821 కోట్లు సీజీఎస్టీ, రూ.41,864 కోట్లు ఎస్‌జీఎస్టీ, రూ.99,111 కోట్లు ఐజీఎస్టీ రూపంలో వసూలు
- 2024లో ఇప్పటి వరకు నమోదైన వసూళ్లు రూ.12.74 లక్షల కోట్లు

## దీన్ని రాజకీయం చేయొద్దు...

ఎలాంటి అపోహలు సృష్టించవద్దు: బీసీ కమిషన్ చైర్మన్

ఏ తప్పుడు సమాచారం ఇచ్చినా చర్యలు తప్పవని హెచ్చరిక

అన్ని కులాల సామాజిక ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని వ్యాఖ్య

కులగణనలో అన్ని కుల సంఘాలు కీలక పాత్ర పోషించాలన్న చైర్మన్



# ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ కూటమి

**ముంబై :** నామినేషన్ల పర్వం దాదాపు కొలిక్కి రావడంతో మహారాష్ట్ర ఎన్నికల పోరు మేజికల్ టర్న్ తీసుకోబోతోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత రెండు ప్రధాన కూటములకూ డూఆర్‌డై సిట్యువేషన్ ఇది. ఈసారి కౌన్ బనేగా మహారాష్ట్ర సీఎం.. అనే చర్చ ఒకటైతే, తెలంగాణలో సూపర్‌హిట్ కొట్టిన రాహుల్‌గాంధీ గ్యారంటీ కార్డ్ మహారాష్ట్రలో వర్కవుటౌతుందా అనేది మరో సస్పెన్స్..! గ్యారంటీ కార్డుపై శత్రు కూటమి ఇప్పటికే సీరియస్‌గా సెటైర్లందుకుంది..కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల సెంటిమెంట్‌ను మహారాష్ట్రలో కూడా ప్రయోగించబోతోందన్న వార్తలు అక్కడి పాలిటిక్స్‌లో వేడి పుట్టించేశాయి. బీజేపీ నేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఈ అంశంపై తీవ్రంగా స్పందించారు. రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్‌లో అడ్డం తిరిగిన గ్యారంటీ కార్డు, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో వ్యతిరేకత కూడగట్టిన గ్యారంటీ కార్డు.. మహారాష్ట్రలో ఎలా పని చేస్తుందని, కాంగ్రెస్ ఎక్స్‌పరిమెంట్‌పై సెటైరేశారు ఫడ్నవీస్.అటు.. ఈసారి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఛాన్స్ ఎవరికి దక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది. మహా యుతి కూటమి గెలుపు ఖాయమని, బీజేపీ నేతకే సీఎం సీటు దక్కుతుందని ఓటో అధినేత రాజ్‌థాకరే చేసిన కామెంట్లు కాక రేపుతున్నాయి. మహా యుతి కూటమికి మేజిక్ ఫిగర్ రాదని, బయట నుంచి తాము మద్దతిస్తామని కూడా చెప్పారు రాజ్‌థాకరే. ప్రస్తుతానికి రెండు కూటములకూ దూరంగా ఉంది రాజ్‌థాకరే పార్టీ. ఆయన వ్యాఖ్యలు మాత్రం రెండు కూటముల్లోనూ అంతర్గతంగా కలకలం రేపాయి. ముఖ్యంగా శివసేన-షిండే వర్గం తాజా పరిణామాల్ని సీరియస్‌గా గమనిస్తోంది.మహారాష్ట్రలో నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరి తేదీ నవంబర్ 4. ఆలోగా రెబల్ అభ్యర్థుల్ని దారికి తెచ్చుకుని, నామినేషన్లను వెనక్కు తీసుకునేలా మంతనాలు షురూ చేశాయి పార్టీలన్నీ. అటు.. ఎమ్‌వీఏ కూటమి 11




స్థానాల్లో.. మహా యుతి కూటమి 4 చోట్ల ఇప్పటికీ అభ్యర్థుల్ని ప్రకటించనే లేదు.మహా యుతి కూటమి తరపున ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, నితిన్ గడ్కరీ, యోగి ఆదిత్యనాథ్ లాంటి స్టార్ క్యాంపెయినర్లు ప్రచార షెడ్యూల్ ఖరారు చేసుకుంటున్నారు. మహా వికాస్ అఘాడీ తరఫున ప్రచారం కోసం రాహుల్‌గాంధీ సుడిగాలి పర్యటన చేపడతారని పార్టీ వర్గాలు తెలిపాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ మేనిఫెస్టోను నవంబర్ 6న ముంబైలో విడుదల చేయనున్నారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తోపాటు శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే హాజరుకానున్నారు. 288 మంది సభ్యులున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నవంబర్ 20న పోలింగ్ జరగనుండగా, మూడు రోజుల తర్వాత ఓట్ల లెక్కింపు జరగనుంది. ఎన్నికల కమిషన్‌కు 7,995 మంది అభ్యర్థులు 10,905 నామినేషన్లు దాఖలు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. మరో వారం రోజుల్లో మహాగల్లీల్లో లౌడ్‌స్పీకర్లు మోతెక్కిపోవడం మాత్రం గ్యారంటీ..!

# కొత్త పుంతలు తొక్కుతున్నపారిశ్రామిక రంగం

**ముంబై :** దేశంలోని పారిశ్రామిక రంగం నుండి ఆర్థిక వ్యవస్థకు గొప్ప వార్త అందింది. దేశ పారిశ్రామికోత్పత్తికి వెన్నెముకగా ఉన్న కోర్ సెక్టార్ ఆగస్టులో షాక్ నుంచి కోలుకుంది. సెప్టెంబర్‌లో 8 ప్రధాన రంగాల ఉత్పత్తి ఏడాది ప్రాతిపదికన 2% పెరిగింది. ఆగస్టులో 1.8 శాతం క్షీణత నమోదైంది. ఆగస్టులో తగ్గుదల భారత పరిశ్రమ, ఆర్థిక వ్యవస్థపై అనేక సందేహాలకు దారితీసింది. దాదాపు 41 నెలల తర్వాత తొలిసారి తగ్గింది. ఆగస్టు నెలతో పోల్చితే ప్రధాన రంగాల ఉత్పత్తి 2 శాతం పెరిగిందని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి.సిమెంట్, రిఫైనరీ ఉత్పత్తులు, బొగ్గు, ఎరువులు, విద్యుత్, ఉక్కు ఉత్పత్తి సెప్టెంబర్ 2024లో సానుకూల వృద్ధిని నమోదు చేసిందని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం పరిశ్రమ మరియు వాణిజ్య మంత్రిత్వ శాఖ ఎనిమిది ప్రధాన పరిశ్రమల సూచీ (ఐసిఐ)ని విడుదల చేసింది. ఇందులో సెప్టెంబర్‌లో దేశంలోని 8 ప్రధాన పరిశ్రమల ఉత్పత్తి గణాంకాలను పంచుకున్నారు. ఈ గణాంకాల ప్రకారం సెప్టెంబర్‌లో కోర్ సెక్టార్ 2% వృద్ధిని సాధించింది. ముఖ్యంగా రిఫైనరీ, సిమెంట్ రంగాల ఉత్పత్తిలో అత్యధిక వృద్ధి నమోదైంది. ఈ 8 పరిశ్రమలు పారిశ్రామిక ఉత్పత్తి సూచిక (ఎఎెఖ)లో 40.27% ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ రంగం పనితీరు దేశ పారిశ్రామిక కార్యకలాపాలకు ఆర్థిక ఆరోగ్యానికి బేరోమీటర్‌గా పనిచేస్తుంది.ఇండెక్స్‌లో 2.63 శాతం వెయిటేజీని కలిగి ఉన్న ఎరువుల ఉత్పత్తి, గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 2024 సెప్టెంబర్‌లో 1.9 శాతం పెరిగింది. 2024-25 ఏప్రిల్ నుండి సెప్టెంబరు వరకు దాని సంచిత సూచిక మునుపటి సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 1.7 శాతం పెరిగింది. సెప్టెంబరు 2024లో స్టీల్ ఉత్పత్తి 1.5 శాతం పెరిగింది. సిమెంట్ రంగానికి సంబంధించి, ఉత్పత్తి 7.1 శాతం పెరిగింది. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్ మరియు విద్యుత్ ప్రధాన రంగాల వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో 4.2 శాతంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది 8.2 శాతంగా ఉంది. ఎఅఎ ఎనిమిది ప్రధాన పరిశ్రమల ఉత్పత్తి సంయుక్త , వ్యక్తిగత పనితీరును కొలుస్తుంది. సిమెంట్, బొగ్గు, ముడి చమురు, విద్యుత్, ఎరువులు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు మరియు ఉక్కు. ఎనిమిది ప్రధాన పరిశ్రమలు పారిశ్రామిక ఉత్పత్తి సూచిక (ఎఎెఖ)లో చేర్చబడిన వస్తువుల బరువులో 40.27 శాతం కలిగి ఉంటాయి. మొత్తం పారిశ్రామిక వృద్ధిని కొలిచే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపి)కి ఎనిమిది ప్రధాన రంగాలు 40.27 శాతం సహకారం అందిస్తున్నాయి.

**ప్రథమార్థంలో 4.2 శాతం వృద్ధి**

మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, జూన్ 2024లో ఎనిమిది ప్రధాన పరిశ్రమల సూచీ తుది వృద్ధి రేటు 5.0 శాతంగా ఉంది. ఇది కాకుండా, 2024-25 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు సంచిత వృద్ధి రేటు గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 4.2 శాతం ఎక్కువ.

**బొగ్గు ఉత్పత్తి 2.6 శాతం పెరుగుదల**

2023తో పోలిస్తే 2024 సెప్టెంబర్‌లో బొగ్గు ఉత్పత్తి 2.6 శాతం పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు తొలి త్రైమాసికంలో గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే క్యుములేటివ్ ఇండెక్స్ 5.9 శాతం పెరిగింది. 8 కోర్ ఇండెక్స్‌లో బొగ్గు ఉత్పత్తి బరువు 10.33 శాతం.

**ముడి చమురు ఉత్పత్తి తగ్గుదల**

సెప్టెంబర్ 2023తో పోలిస్తే 2024 సెప్టెంబర్‌లో ఉత్పత్తిలో 3.9 శాతం క్షీణత ఉంది. 2024-25 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు సంచిత ఇండెక్స్ మునుపటి సంవత్సరంతో పోలిస్తే 2.1 శాతం క్షీణించింది. ఐసీఐలో ముడి చమురు ఉత్పత్తి బరువు 8.98 శాతం.

**సహజ వాయువు తగ్గింపు**

సహజవాయువు ఉత్పత్తి సెప్టెంబర్ 2023తో పోలిస్తే 2024 సెప్టెంబర్‌లో 1.3 శాతం తగ్గింది. అయితే, 2024-25 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు దాని సంచిత సూచిక గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 2.0 శాతం పెరిగింది. ఇండెక్స్‌లో దీని బరువు 6.88 శాతం.

**పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తులు**

పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తి సెప్టెంబర్ 2023తో పోలిస్తే 2024 సెప్టెంబర్‌లో 5.8 శాతం పెరిగింది. గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 2024-25 ఏప్రిల్ నుండి సెప్టెంబరు మధ్య కాలంలో దీని సంచిత ఇండెక్స్ కూడా 2.3 శాతం పెరిగింది. ఇండెక్స్‌లో దీని బరువు 28.04 శాతం.

ఎరువుల ఉత్పత్తిలో పెరుగుదల

సెప్టెంబర్ 2023తో పోలిస్తే 2024 సెప్టెంబర్‌లో ఎరువుల ఉత్పత్తి 1.9 శాతం పెరిగింది. దీనితో పాటు, గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 2024-25 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు దాని సంచిత సూచిక 1.7 శాతం పెరిగింది. ఇండెక్స్‌లో దీని బరువు 2.63 శాతం.

ఉక్కు ఉత్పత్తి

ఎఅఎలో 17.92 శాతం బరువు కలిగిన ఉక్కు ఉత్పత్తి సెప్టెంబర్ 2023తో పోలిస్తే 1.5 శాతం పెరిగింది. ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు, 2024-25, దాని సంచిత ఇండెక్స్ కూడా గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 6.1 శాతం పెరిగింది.

అగ్రగామిగా సిమెంట్ రంగం

సిమెంట్ రంగం ఎఅఎలో అగ్రగామిగా నిరూపించబడింది. 5.37 శాతం బరువు కలిగిన ఈ రంగం సెప్టెంబర్ 2023తో పోలిస్తే 2024 సెప్టెంబర్‌లో 7.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 2024-25 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు దాని సంచిత సూచిక 1.6 శాతం పెరిగింది.

విద్యుత్ ఉత్పత్తి

ఇండెక్స్‌లో 19.85 శాతం వెయిటేజీని కలిగి ఉన్న విద్యుత్ రంగం ఉత్పత్తి సెప్టెంబర్, 2023తో పోలిస్తే 2024 సెప్టెంబర్‌లో 0.5 శాతం తగ్గింది. ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు, 2024-25, దాని సంచిత ఇండెక్స్ కూడా గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 5.9 శాతం క్షీణించింది.

# తిరుమల ప్రక్షాళన అంత ఈజీయేనా

**తిరుమల :** తిరుమల తిరుపతి పాలక మండలి ఏర్పాటు ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. 24 మందితో ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సగం మంది సొంత రాష్ట్రానికి చెందిన వారైతే మిగతా సగం ఇతర రాష్ట్రాల సభ్యులతో టీటీడీ పాలక మండలి ఏర్పాటైంది. ఎంతోమంది ఆశావాహులు మరెంతో మంది ప్రముఖులు టీటీడీ బోర్డు కు పోటీ పడ్డా ఎట్టకేలకు బీఆర్ నాయుడు చైర్మన్‌గా కూటమి సర్కార్ తిరుమల పాలక మండలిని నియమించింది. ఎన్నో సవాళ్లు మరెన్నో సమస్యలను చాలెంజ్‌గా టీటీడీ కొత్త పాలక మండలి ఏర్పాటు కాబోతోంది..!తిరుమల తిరుపతి దేవస్థానం. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు టాప్ ప్రియారిటిగా ఉన్న టీటీడీలో పాలన అత్యంత పారదర్శకంగా ఉండాలన్నదే లక్ష్యం. ఈ మేరకు సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే తిరుమలలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు ఇప్పుడు టీటీడీకి నియమించిన కొత్త పాలకమండలి ఏ రకమైన సవాళ్లను, సమస్యలను ఎదుర్కోబోతోంది అన్నది ఇప్పుడు చర్చ. 24 మందితో ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ప్రముఖ రంగాలకు చెందిన ప్రముఖులకు బోర్డులో స్థానం కల్పించింది. ఏపీ నుంచి చైర్మన్ తో పాటు 12 మంది, మరో 12 మందిని ఇతర రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన ఏపీ సర్కార్ బోర్డు సభ్యులుగా మహిళలకు కూడా పెద్ద పీట వేసింది. కూటమిలోని పక్షాలు, అంకితభావంతో పనిచేసిన నేతలకు ప్రియారిటి ఇచ్చిన సీఎం చంద్రబాబు సొంత జిల్లాకు చెందిన బిఆర్ నాయుడును టీటీడీ చైర్మన్ గా నియమించారు.టీటీడీ బోర్డులో జిల్లాకు మరింత ప్రాధాన్యం



ఉంటుందని భావించిన కూటమి పార్టీల శ్రేణులు మిశ్రమ స్పందన కనిపిస్తుండగా ఆశావాహులకు మాత్రం టీటీడీ బోర్డులో స్థానం దక్కకుండా పోయింది. చైర్మన్ తోపాటు చిత్తూరు తిరుపతికి చెందిన వారికి ముగ్గురికి స్థానం దక్కింది. అన్యూహంగా కుప్పం క్లస్టర్ ఇంచార్జ్ శాంతారామ్, మాజీ ఎంపీ పనబాక లక్ష్మికి బోర్డులో స్థానం కల్పించారు. గత ఐదేళ్లలో టీటీడీ తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలు, అమలు చేసిన పథకాలు, చేసిన ఖర్చులు పై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న సమయంలో కొత్త పాలకమండలి తీసుకునే నిర్ణయాలు మరింత కీలకం కానున్నాయి.గత ప్రభుత్వం తిరుమలలో చాలా అరాచకాలకు పాల్పడిందంటూ ఇప్పటికే ఆరోపణలు చేసిన కొత్త చైర్మన్ బిఆర్ నాయుడు తన ముందున్న లక్ష్యం ఏంటో స్పష్టం చేశారు. గత ఐదేళ్లుగా తిరుమలకే వెళ్లలేకపోయానన్న టీటీడీ బోర్డు కొత్త చైర్మన్ బిఆర్ నాయుడు తిరుమల పవిత్రతను కాపాడటమే లక్ష్యం అని తెలిపారు. భక్తులకు సంతృప్తికరమైన స్వామివారి దర్శనం కల్పించడంతోపాటు మెరుగైన వసతులు కల్పించడమే ప్రధాన లక్ష్యం కాబోతోంది.కొత్త పాలక మండలికి సాధారణ భక్తులే ప్రియారిటిగా మారబోతోంది. గత ప్రభుత్వంలో అత్యంత వివాదాస్పదంగా మారిన శ్రీవాణి ట్రస్ట్ వ్యవహారంపై కొత్త పాలక మండలి దృష్టి సారించబోతుంది. శ్రీవాణి ట్రస్ట్ రద్దు చేయాలన్న ఆలోచన లో కొత్త పాలక మండలి భక్తులకు గంటలోపే దర్శనం జరిగేలా ఎలాంటి విధానం అమలు చేయాలో దానిపై దృష్టి పెట్టే అవకాశం కనిపిస్తోంది. టైం స్లాట్ పద్ధతిని తీసుకురావడంతో పాటు త్వరితగతిన భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేలా నిర్ణయాలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే, వీఐపీ దర్శనాలు, వాళ్ళు ఇచ్చే సిఫారసు లెటర్ల తోపాటు ఈ మధ్యకాలంలో దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన కల్తీ నెయ్యి వ్యవహారం కొత్త పాలకమండలికి సవాళ్లుగా మారబోతున్నాయి.మరోవైపు గత ప్రభుత్వంలోని బోర్డు తీసుకున్న నిర్ణయాలు, అందులో దాగి ఉన్న అక్రమాలను బయట పెట్టడంతో పాటు తిరిగి అలాంటి నిర్ణయాలకు తావు లేకుండా చేయడమే కొత్త పాలకమండలి ముందున్న లక్ష్యంగా ఉంది. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన పాలకమండలిలోని సభ్యులే కొందరు కొత్త పాలకమండలి లోనూ ఉండడంతో అప్పుడు తీసుకున్న నిర్ణయాలు తప్పని ఇప్పుడు తేల్చే బాధ్యత ఎవరిదన్నది కూడా మరో చర్చగా మారే అవకాశం ఉంది. మరోవైపు టీటీడీ బడ్జెట్‌లో దాదాపు మొత్తం సొమ్ము ఇంజనీరింగ్ పనులకు కేటాయించడం, శ్రీవాణి ట్రస్ట్ నిధులను ఇష్టరాజ్యంగా ఖర్చు పెట్టడం ఎవరి ప్రయోజనాలకు మేలు జరిగిందన్న విషయాన్ని కూడా కొత్త పాలక మండలి తేల్చాల్సి ఉంది. చూడాలి మరీ కొత్త పాలక మండలి ఏమేరకు సంచలన నిర్ణయాలు తీసుకుంటుందో..!

## ఢిల్లీని ముంచేసిన పొగ మంచు

**న్యూఢిల్లీ :** దేశరాజధాని ఢిల్లీలో దీపావళి వేడుకల తరవాత గాలి కాలుష్యం మరింత పెరిగిపోయింది. సాధారణ సమయాల్లోనే ఇక్కడ కాలుష్యం ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. రోడ్లపై వాహనాలు కూడా కనిపించకుండా దట్టంగా కాలుష్యంతో నిండిపోతుంది. ఇక దీపావళి వచ్చిందంటే ఢిల్లీ



కాలుష్యంతో నిండిపోవాల్సిందే. ప్రతి ఏడాది పండుగ ముందే ప్రభుత్వం దీనిపై హెచ్చరికలు కూడా జారీ చేస్తుంది. క్రాకర్స్ పేల్చడంపై నిషేదం విధిస్తుంది. ఈ ఏడాది కూడా ప్రభుత్వం రాజధాని నగరంలో క్రాకర్స్ పేల్చడంపై నిషేదం విధించింది. వచ్చే ఏడాది జనవరి 1 వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని ప్రకటించింది.కానీ ప్రతి ఏడాది లానే ఈ ఏడాది కూడా ప్రభుత్వ ఆదేశాలను ప్రజలు లెక్క చేయలేదు. ప్రాణాలకంటే తాత్కాలిక సంబురాలే ముఖ్యం అనుకున్నారో ఏమో కానీ ఇష్టానుసారంగా టపాకాయాలు పేల్చేశారు. ఫలితంగా వాటి వల్ల వచ్చిన దుమ్ము దూళికి గాలి నాణ్యత మరింత దిగజారడంతో రాజధానిలో పొగమంచు కమ్ముకుంది. ఈ నేపథ్యంలో ఉదయం 7 గంటలకు 361 ఒఖిఎ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) నమోదైంది. నిన్న 328 ఏక్యూఈ ఉండగా ఈరోజు ఉదయం వరకు అది గణనీయంగా పెరిగింది. దీంతో మళ్లీ నగరంలో రోడ్లపై వాహనాలు కనిపించని పరిస్థితులు నెలకొన్నాయి.సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్ట్ డేటా ప్రకారంగా గత కొన్నేళ్లుగా దీపావళి తరవాత ఢిల్లీలో కాల్యుష్యం పెరిగిపోతుంది. ఈ డేటా ప్రకారంగా 2023లో దీపావళి రోజున 218 ఏక్యూఐగా నమోదైంది, 2022లో 312, 2021లో 382, 2020లో 414, 2019లో 337, 2018లో 281, 2017లో 431ఏక్యూఐగా నమోదైంది. మరోవైపు ఈ ఏడాది నగరంలోని చాలా ప్రాంతల్లో గాలి నాణ్యత 380 ఏక్యూఐ కంటే ఎక్కువగా నమోదైనట్టు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా 400 దగ్గరకు చేరుకుంది. ఆర్కే పురంలో 398 ఏక్యూఐ నమోదైనట్టు సీపీసీబీ డేటా చెబుతోంది. అదే విధంగా ఢిల్లీలోని ఆనంద్ విహార్‌లో 395, అశోక్ విహార్‌లో387, బురారీ క్రాసింగ్ ప్రాంతంలో 395, చాందినీ చౌక్ 337, ద్వారక సెక్టార్ వద్ద 376గా ఎయిర్ క్వాలిటీ నమోదైంది.

## ‘వర్డ్ ఆఫ్ ది ఇయర్ 2024’గా కొత్త పదం ‘బ్రాట్’

కాలిన్స్ డిక్షనరీ ‘వర్డ్ ఆఫ్ ది ఇయర్ 2024’గా కొత్త పదం ‘బ్రాట్’ ఎంపికైంది. యూకేకి చెందిన ప్రముఖ గాయని, పాటల రచయిత చార్లీ ఎక్స్‌సీఎక్స్ ఈ పదాన్ని నిర్వచించారు. ‘బ్రాట్’ అనే పదం సింగర్ చార్లీ విడుదల చేసిన ఆరవ ఆల్బమ్ పేరు అని, విశ్వాసం, స్వతంత్రత, సుఖాలు కోరుకునే వైఖరి... అనే అర్థాలను ఇస్తుందని కాలిన్స్ డిక్షనరీ పేర్కొంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌తో పోటీ పడుతున్న కమలా హారిస్ మద్దతుదారులు ఈ పదాన్ని స్వీకరించి వినియోగిస్తున్నారని, దీంతో ‘బ్రాట్’ పదాన్ని కాలిన్స్ వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైందని శుక్రవారం పేర్కొంది. 2024లో ఎక్కువగా మాట్లాతున్న పదాలలో ఒకటిగా బ్రాట్ పదం మారిందని కాలిన్స్ డిక్షనరీ తెలిపింది. విజయవంతమైన ఆల్బమ్ కంటే ‘బ్రాట్’ అనేది ఒక సాంస్కృతిక దృగ్విషయంగా మారిందని, ఈ పదం ప్రపంచవ్యాప్తంగా వినిపించిందని తెలిపింది. కాగా యూకేకి చెందిన 32 ఏళ్ల పాప్ స్టార్ చార్లీ ఎక్స్‌సీఎక్స్ అసలు పేరు షార్లెట్ ఎమ్మా ఐచిసన్. ఒక సాధారణ ఆకతాయి అమ్మాయి కొంచెం తలతిక్కగా, పార్టీలను ఇష్టపడే వ్యక్తి అని ఆమె ‘బ్రాట్’ అనే పదం గురించి వివరించారు. తమని తాము తెలివి తక్కువ వాళ్లమని భావించే వ్యక్తులు అని కూడా భావించవచ్చని, అయితే ఆ తర్వాత వారి వైఖరి మారవచ్చని, అది కూడా పార్టీల ద్వారానే అని ఆమె వివరించారు. ఈ ఏడాది జులైలో అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారీస్‌ను ‘బ్రాట్’ అని పేర్కొంటూ షార్లెట్ ఎమ్మా ట్వీట్ చేసింది. అధ్యక్ష ఎన్నికల్లో కమలాను ప్రమోట్ చేయడంలో భాగంగా తన ఆల్బమ్‌లోని ‘365’ పాటను ఉపయోగించి ‘కమల ఈజ్ బ్రాట్’ పేరిట ఒక టిక్ టాక్ వీడియో రిలీజ్ చేసింది. షార్లెట్ ఎమ్మా విడుదల చేసిన ‘బ్రాట్’ ఆల్బమ్ యూకేలో మొదటి స్థానంలో, అమెరికాలో మూడవ స్థానంలో నిలిచింది.

## చీనాబ్ బ్రిడ్జిపై కన్నేసిన పాక్..
## చైనా కోరిక మేరకు సమాచార సేకరణ

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జను జమ్మూకశ్మీర్‌లో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఆ రాష్ట్రంలోని రియాసీ జిల్లాలో చీనాబ్ నదిపై ఈ బ్రిడ్జను నిర్మిస్తున్నారు. అయితే, ఈ ఎత్తైన వంతెనపై పొరుగు దేశం పాకిస్థాన్ కన్నుపడినట్లు తెలుస్తోంది. బ్రిడ్జ్‌కు సంబంధించిన సమాచారాన్ని పాక్ సేకరిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం



వచ్చినట్లు జాతీయ మీడియా పేర్కొంది. చైనా కోరిక మేరకు పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ వర్గాలు వంతెనకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తున్నట్లు సదరు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయితే, ఆ వివరాలు ఎందుకు తెలుసుకుంటున్నారనే విషయంపై మాత్రం స్పష్టత లేదు. కాగా, చీనాబ్ రైలు వంతెనను భారతీయ రైల్వే ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. ఉక్కు, కాంక్రీట్‌తో నిర్మించిన ఈ వంతెన జమ్మూ కశ్మీర్‌లోని జమ్మూ డివిజన్ రియాసి జిల్లా బక్కల్ %-% కౌరీ మధ్య ఉంది. కశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టులో భాగంగా చీనాబ్ వంతెనను నిర్మించారు. నదీ గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తున చీనాబ్ నదిపై 1,315 మీదర్ల పొడవైన వంతెనను నిర్మించారు. చైనాలోని బెయిపాన్ నదిపై నిర్మించిన 275 మీటర్ల పొడవైన షుబాయ్ రైల్వే వంతెన పేరుపై ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. ఇక పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువగా ఉండటం విశేషం. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఈ రైల్వే వంతెన నిర్మాణం దాదాపు పూర్తైంది. దీని నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి 20 ఏళ్లు పట్టింది. ఈ చారిత్రక వంతెనపై ఈ ఏడాది జూన్ 20న తొలి రైలు ట్రయల్ రన్‌ను కూడా విజయవంతంగా నిర్వహించారు. తద్వారా కశ్మీర్‌లోని రియాసి నుండి బారాముల్లా వరకు రైలు సేవల ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. త్వరలో ఈ వంతెన రైలు సేవలకు అందుబాటులోకి రానుంది.

## అక్టోబరులో రికార్డ్ స్థాయిలో జీఎస్టీ వసూళ్లు

అక్టోబరు-2024 జీఎస్టీ వసూళు రూ.1.87 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది అక్టోబరుతో పోలిస్తే 8.9 శాతం, సెప్టెంబర్ నెలతో పోలిస్తే 8.1 శాతం వృద్ధి నమోదైంది. గత ఏడాది అక్టోబరు నెలలో రూ.1.72 లక్షల జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి.




రూ.1,87,346 కోట్ల జీఎస్టీ వసూళ్లలో రూ.33,821 కోట్లు సీజీఎస్టీ కాగా, రూ.41,864 కోట్లు ఎస్‌జీఎస్టీ, రూ.99,111 కోట్లు ఐజీఎస్టీ రూపంలో వసూలయ్యాయి. సెస్‌ల రూపంలో మరో రూ.12,550 కోట్లు వచ్చాయి. జీఎస్టీ వసూళ్లలో పెరుగుదల మెరుగైన ఆర్థిక కార్యకలాపాలు, పన్ను వసూలు సామర్థ్యాన్ని సూచిస్తుంది. దేశీయ లావాదేవీలు 10.6 శాతం వృద్ధి చెంది రూ.1.42 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. దిగుమతులపై విధించిన పన్నులు 4 శాతం పెరిగి రూ.45,096 కోట్లుగా నమోదయ్యాయి. 2024 క్యాలెండర్ ఏడాదిలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం జీఎస్టీ వసూళ్లు రూ.12.74 లక్షల కోట్లు. 2023లో ఇదే కాలంలో నమోదైన రూ.11.64 లక్షల కోట్లతో పోలిస్తే ఈ ఏడాది 9.4 శాతం వృద్ధి నమోదైంది.

# గులాబీ నేతలకు రివర్స్ పంచ్

-మొదటిపేజీ తరువాయి

నిర్వహిస్తూ, మూసీ పునరుజ్జీవానికి కట్టుబడి ముందడుగు వేస్తున్నారు.మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ప్రభుత్వం తరఫున తప్పనిసరిగా డబుల్ బెడ్ రూములు అందజేస్తామని ఇటీవల సీఎం ప్రకటించారు. అంతేకాదు చాలావరకు మూసీ పరివాహక ప్రజలు స్వచ్ఛందంగా తమ ఇళ్ల ను ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం కేటాయిస్తున్న డబుల్ బెడ్ రూమ్ గృహాలలోకి వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే మూసీ పునరుజ్జీవం పై బీఆర్ఎస్ విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. మూసీ నది పేరుతో అవినీతికి పాల్పడేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఇటీవల మాజీ మంత్రి కేటీఆర్ సైతం విమర్శించారు. మూసీ పునరుజ్జీవంలో వెనకడుగేసే ప్రసక్తే లేదని, పరివాహక ప్రాంత ప్రజలకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, రాత్రి 7 గంటల నుండి ఉదయం 7 గంటల వరకు భారీ మార్కెట్



నిర్వహించేలా కూడా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందని సీఎం అన్నారు. అంతేకాదు తాను మూసీ ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు, కేటీఆర్, హరీష్ పాల్గొనాలని, అప్పుడే స్థానిక ప్రజలను మూసీ అభివృద్ధిపై అడుగుదామంటూ సవాల్ విసిరారు.ఇలా మూసీ పునరుజ్జీవం కేంద్రంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య విమర్శల పర్వం సాగుతుండగా, మూసీ పరివాహ ప్రజల పేరుతో ఒక ప్రకటన విడుదలైంది. అయ్యా కేసీఆర్, కేటీఆర్, ఈటెల రాజేందర్ గార్లూ.. ఒక్కరోజు మాతో కలిసి మూసీ ఒడ్డున ఉండి చూడండి.. మా బాధలు మీకు తెలుస్తాయి.. మీ కోసం ప్రత్యేక బస కూడా ఏర్పాటు చేశాం.. అంటూ మూసారాం బాగ్ మూసీ పరివాహక ప్రాంతంలో ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశారు. ఇక్కడి కంపు మీకు తెలుస్తుంది. మీరు వచ్చేందుకు సిద్దమే కదా అంటూ అక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు.అక్కడి ప్రజలు, కాంగ్రెస్ నాయకులు. వీరి కోసం చేసిన బస ఏర్పాట్ల వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆ వీడియోలో ఓ మంచం, ఒక బబుల్, అక్కడే బాత్ రూమ్స్, ఇలా ఏర్పాట్లు చేసినట్లుగా ఉంది. మాకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ లు కేటాయిస్తే స్వచ్ఛందంగా ఇక్కడ ఇళ్లను ఖాళీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అలాంటప్పుడు దీనిపై రాజకీయం ఎందుకంటూ వారు ప్రశ్నించడం గమనార్హం. మరి మూసీ పరివాహక ప్రజల పిలుపుకు కేసిఆర్, కేటీఆర్, ఈటెల రాజేందర్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# కవితకు జాగృతి చిక్కు

**హైదరాబాద్ :** భారత్ జాగృతి బతుకమ్మ పండుగ నేపథ్యంలో ఏర్పడి.. తర్వాత కాలంలో ఉద్యమం దిశగా సాగిన వ్యవస్థ. కేసీఆర్ కుమార్తె కవిత ఆధ్వర్యంలో ఆరంభంలో బాగానే నడిచినా.. క్రమేపీ జాగృతి కార్యకలాపాల వేగం తగ్గిందనే చెప్పాలి. ఢిల్లీ లిక్కర్ కేసులో.. కవిత పేరు చేర్చిన నాటి నుంచి తెలంగాణలో ఈ మాటే దాదాపు కనుమరుగు అయ్యిందనే ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం జాగృతి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందట.భారతీయ రాష్ట్ర సమితి అనుబంధ సంస్థగా పేరు తెచ్చుకున్న భారత్ జాగృతిని కేసీఆర్ కుమార్తె కవిత ప్రారంభించారు. తెలంగాణ ప్రాంతానికి అత్యంత కీలకమైన బతుకమ్మ పండుగ నిర్వహణ కోసం ప్రారంభమైన జాగృతి.. తర్వాత కాలంలో అనేక సభలూ.. సమావేశాలు నిర్వహించింది. జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలిగా కవిత ఉండి.. అన్నీ తానై నడిపించారు. ఇక్కడవరకూ ఓకే.. కానీ.. ఇటీవల కాలంలో ఆమె జైలుపాలు కావటంతో.. జాగృతి భవితవ్యం ఏంటని చర్చ జోరుగా సాగిందట.భారత్ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత? రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ జాగృతి కమిటీలను మార్చి 10న రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామని ఆమె ప్రకటించారు కూడా. జాగృతి కమిటీలు రద్దు చేసి.. సుమారు ఏడు నెలలు దాటినా? నూతన కమిటీలపై ఆమె దృష్టి సారించడం లేదనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టైన కవిత.. చాలాకాలం జైలు జీవితాన్ని గడిపారు. ఒకానొక సమయంలో ఆమెకు బెయిల్ కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు తెలంగాణలో అధికారం కోల్పోవటం, మరోవైపు కుమార్తె జైలు పాలవటంతో కేసీఆర్.. ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దేశ రాజకీయాల్లోనూ చక్రం తిప్పుతానని శపథం చేసిన కేసీఆర్ ప్రస్తుతం ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. ఈ నేపథ్యంలో కొత్త కమిటీల మాటెలా ఉన్నా.. జాగృతి ఉంటుందా లేదా అనే



అనుమానాలు తెరపైకి వస్తున్నాయి. 2006 ఆగస్టులో భారత్ జాగృతిని కవిత ఏర్పాటు చేశారు. తర్వాత ఏడాది అంటే 2007 నవంబర్ నుంచి జాగృతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు అధికారికంగా ప్రారంభమ్యాయి. బతుకమ్మ పండుగను అన్ని తామై జాగృతి సభ్యులు ముందుండి నడిపించారనే వాదన ఉంది.2014లో ఃఖీూ అధికారంలోకి వచ్చిన తరువాత పదేళ్లపాటు తిరుగులేని ఆధిపత్యాన్ని? జాగృతి కొనసాగించింది. జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ కమిటీలను పెద్ద ఎత్తున్న ఏర్పాటు చేసి తమ పరిధిని పెంచుకోవటంపై కవిత దృష్టి సారించారు. ఏమైందో? ఏమో?.ఃఖీూ పార్టీ అధికారం కోల్పోయిన తరువాత జాగృతి కమిటీలు రద్దు చేశారు కవిత. ఢిల్లీ లిక్కర్ కేసులో బెయిల్‌పై విడుదల అయిన కవిత.. జాగృతి నూతన కమిటీలపైన దృష్టి సారిస్తారని అందరూ భావించారు. తీరా చూస్తే.. ఆమె పూర్తిస్థాయి విశ్రాంతికే పరిమితం అయ్యారట. నూతన కమిటీల ఊసే లేకపోవటంతో.. జాగృతి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. జాగృతి కమిటీల్లో ఉన్నవారు.. ఎటూ తేల్చుకోలేక పోతున్నారట. కమిటీలు రద్దు అయ్యి నెలలు గడుస్తున్నా.. నూతన కమిటీలపై దృష్టి పెట్టకపోవడం, ఎవరికీ ఆమె అందుబాటులోకి రాకపోవడంపై.. గతంలో జాగృతి కమిటీలో ఉన్నవారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారట. భారత్ జాగృతి.. నూతన కమిటీలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని చర్చ.. తెలంగాణ వ్యాప్తంగా సాగుతోందట. గతంలో యాక్టివ్‌గా ఉండి అన్నీ తానై నడిపించిన కవిత.. కేసులో ఇరుక్కోవటంతో సమయం లేక ఆ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారట. ఆమె బయటకు వచ్చాక.. మళ్లీ భారత్ జాగృతిపై దృష్టి సారిస్తారని అంతా భావించారు. కానీ.. కవిత మాత్రం తాను విశ్రాంతి తీసుకుంటానని ప్రకటించటంతో ఓ రకంగా జాగృతి సభ్యులు తీవ్ర నిరాశ వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నవంబర్ నెలలో జాగృతి కార్యకలాపాలపై దృష్టి సారిస్తారనే వార్తలూ వినిపిస్తున్నాయి. పార్టీ అధికారం కోల్పోయింది కాబట్టి.. నూతన కమిటీల ఏర్పాటులో జాప్యం జరుగుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉద్యమ సమయంలో ఏర్పాటు చేశారు కాబట్టి.. అధికారం కోల్పోగానే ఎలా రద్దు చేస్తారని.. అందులోని సభ్యులే చర్చించుకుంటున్నారట. అసలు జాగృతి కమిటీలు రద్దు ఎందుకు చేసుకోవాల్సి వచ్చిందని పొలిటికల్ సర్కిల్లో టాక్ వినిపిస్తుంది. మరోవైపు.. జాగృతి రన్ అవుతున్న సమయంలోనే పెద్ద మొత్తంలో జాగృతి ఫండ్ వసూల్ చేశారని ఆరోపణలున్నాయి. అంత పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి వాటిని ఎటువైపు మళ్లించారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయట. కమిటీల ఏర్పాటు మాటెలా ఉన్నా.. వసూలైన ఎమౌంట్‌కు లెక్కాపత్రాల సంగతేంటని కొందరు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ లిక్కర్ కేసులో బెయిల్‌పై విడుదలైన కవిత? కొన్ని రోజుల నుంచి పూర్తి స్థాయి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆమె దీపావళి పండుగ తర్వాత యాక్టివ్ అవుతారని ఆమె వర్గీయులు చెబుతున్నారట. కొత్త కమిటీల ఏర్పాటుతో పాటు పాత ఫండింగ్ విషయంలో తలెత్తిన ప్రశ్నలకు కవిత ఏ విధంగా సమాధానం చెబుతారో చూడాలి.

# తెలంగాణలో మయోనైజ్ బ్యాన్

-మొదటిపేజీ తరువాయి

తీసుకున్నట్లుగా తెలుస్తోంది. సాధారణంగా ఈ మయోనైజ్‌ను ఎక్కువగా మండి బిర్యానీ, కబాబ్‌లు, పిజ్జాలు, బర్గర్లు, శాండ్‌విచ్‌లు, ఇతరత్రా ఆహార పదార్థాల్లో చెట్నీలా వేసుకుని తింటున్నారని, చాలా చోట్ల దీనిలో కల్తీ జరుగుతోందని ఆయన వివరించారు. గుడ్డులోని పచ్చసొన, నిమ్మరసం, నూనె, ఉప్పుతో తయారు చేస్తారని, ఇది ఉడికించని పదార్థం కావడం వలన హానికర బ్యాక్టీరియా త్వరగా అభివృద్ధి చెందుతుందని అధికారులు తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్ నందినగర్, సింగాడకుంట బస్తీ, గౌరిశంకర్‌కాలనీలలో గత శుక్రవారం జరిగిన సంతలో 'ఢిల్లీ హాట్ మోమోస్' దుకాణంలో విక్రయించిన నాన్‌వెజ్మోమోస్, వాటితో పాటు ఇచ్చిన మయోనైజ్, చట్నీని బస్తీకి చెందిన రేష్మబేగం అనే మహిళ, ఆమె పిల్లలు రుమ్షా, రఫియాలు తిన్నారు. అదేరోజు రాత్రి ముగ్గురికీ విరోచనాలు, వాంతులు అయ్యాయి. పిల్లలిద్దరినీ హాస్పిటల్లో చేర్చగా తల్లి ఇంట్లోనే ఉంది. రేష్మబేగం (31) ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్ హాస్పిటల్కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మరణించింది. గతంలో అల్వాల్‌లోని గ్రిల్ హౌజ్ హోటల్‌లో నాసిరకమైన మయోనైజ్‌ను తిన్న కొందరు యువకులు ఇటీవల హాస్పిటల్ పాలయ్యారు. ఈ కేసులో పోలీసులు ఇవాళ మోమోస్ విక్రయించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్




చేశారు. ఇటీవల జరిగిన ఘటనలతో బల్దియా ఆహార కల్తీ నియంత్రణ విభాగం అప్రమత్తమైంది. ఎన్నిసార్లు చెప్పినప్పటికీ హోటళ్లు తీరు మారట్లేదంటూ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ మేరకు ఆ పదార్థాన్ని నిషేధించేందుకు అనుమతి కోరింది. ఓ మహిళ మోమోస్ తిని మరణించిందంటే బయట భోజనం ఎంత ప్రమాదకరమో అర్థమవుతుంది. మృతి చెందిన మహిళతో పాటు అదే దుకాణంలో మోమోస్ కొని తిన్న మరో 50 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మృతి చెందిన మహిళతో పాటు ఆమె ఇద్దరు కుమార్తెలు కూడా మోమోస్ తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మోమోస్ విక్రయదారుడిని అదుపులోకి తీసుకున్నారు. సరే, ఇప్పుడు మోమోస్ ఒకరిని ఎలా చంపగలవు అనే ప్రశ్న తలెత్తుతుంది? ఈ రోజు ఈ వార్తలో దీని గురించి వివరంగా తెలుసుకుందాం. మోమోస్‌ను తయారు చేయడానికి శుభ్రమైన, మంచి పదార్థాలను ఉపయోగించకపోతే ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదం పెరుగుతుంది. ఇది కాకుండా, కలుషితమైన నీరు, కుళ్ళిన మాంసం లేదా చెడిపోయిన కూరగాయలను మోమోస్ తయారీలో ఉపయోగించినట్లయితే, వినియోగదారుడు సెప్టిక్ షాక్‌కు గురవుతారు. ఈ పరిస్థితిలో సాల్మోనెల్లా లేదా ఇ.కోలి బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఇది ప్రాణాంతకం కావచ్చు. మోమోస్ తయారీలో సరైన పదార్థాలను ఉపయోగించినప్పటికీ, సరిగ్గా ఉడికించకపోయినా, అది ప్రాణాంతకంగా మారవచ్చు. నిజానికి, సాధారణంగా మోమోస్‌లో నింపడానికి ఉపయోగించే పచ్చి లేదా తక్కువగా ఉడికించిన మాంసం ఆరోగ్యానికి ప్రమాదకరం. అటువంటి పరిస్థితిలో, మోమోస్ సరిగ్గా ఉడకకపోతే, వాటిని తినే వ్యక్తి గ్యాస్ట్రోఎంటెరిటిస్ బారిన పడతాడు. దీని కారణంగా, శరీరంలో ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందుతుంది. రోగి వాంతులు, విరేచనాలు, తీవ్రమైన నొప్పితో బాధపడవచ్చు. సకాలంలో చికిత్స అందకపోతే, మోమోస్ తినే వ్యక్తి చనిపోవచ్చు. ఇది కాకుండా, మోమోస్ తయారీలో ఉపయోగించే మసాలా దినుసులు కల్తీ అయితే, అది మోమోస్ తినే వ్యక్తి మరణానికి కూడా దారి తీస్తుంది. అతను చనిపోకపోయినా, అతను తీవ్ర అనారోగ్యానికి గురవుతాడు.

# మహారాష్ట్రకు రేవంత్.. భట్టికి జార్ఖండ్.

**హైదరాబాద్ :** అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న రెండు రాష్ట్రాల్లో స్టార్ క్యాంపెయినర్లుగా తెలంగాణ సీఎం, ఉప సీఎం లకు హైకమాండ్ బాధ్యతలు ఇచ్చింది. తెలంగాణతో సరిహద్దు పంచుకుంటున్న మహారాష్ట్ర ఎన్నికలకు రేవంత్ రెడ్డి స్టార్ క్యాంపెయినర్ గా వెళ్లనున్నారు. ఇప్పటికే అక్కడ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ప్రచారం జోరందుకుంటోంది. త్వరలో రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచార షెడ్యూల్ ఉండే అవకాశం ఉంది. తెలంగాణ నుంచి వెళ్లిన ముంబైలో స్థిరపడిన తెలంగాణవాసులు లక్షల్లో ఉంటారు. ఇతర ప్రాంతాల తెలుగువారు కూడా ఎక్కువే. ఇక నాందేడ్ తో పాటు హైదరాబాద్‌తో దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనూ రేవంత్ ప్రచారం. చేసే అవకాశం ఉంది.కేసీఆర్ మహారాష్ట్రలో పార్టీ పెట్టి ఎంతో కొంత బలం చూపించాలనుకున్నది ఈ ప్రాంతాలపై నమ్మకంతోనే. కానీ ఆయనకు కాలం కలసి రాలేదు. తెలంగాణ, మహారాష్ట్రతో కలిపి యాభై లోక్ సభ సీట్లు సాధించాలనుకున్న ఆయన జీరో దగ్గరే ఆగిపోయారు. ఇప్పుడు తెలంగాణ నుంచే స్టార్ క్యాంపెయినర్‌గా రేవంత్ తమ పార్టీ విజయం కోసం మహారాష్ట్ర వెళ్తున్నారు. ప్రభుత్వంలో నెంబర్ టుగా ఉన్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క కు కూడా హైకమాండ్ ప్రాధాన్యం ఇస్తోంది, ఆయనకు జార్ఖండ్ బాధ్యతలు ఇచ్చారు. అక్కడ రెండు విడతల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే మొదటి విడత ప్రచారం ఊపందుకుంది. అందుకే బట్టి ఇప్పటికే అక్కడ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

## తెలంగాణకు కొత్త సీఎం కన్ఫామ్



**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆ పార్టీ నేతలపై బీజేఎల్పీ నాయకుడు యేలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డికి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. 2025 జూన్ నుంచి డిసెంబర్‌లోగా తెలంగాణకు కొత్త ముఖ్యమంత్రి రాబోతున్నారని జోస్యం చెప్పారు యేలేటీ. కేరళలో ప్రియాంక గాంధీ నామినేషన్ వేసేటప్పుడు వెళ్లినా.. రేవంత్‌ను రాహుల్ గాంధీ కలవలేదన్నారు. ఢిల్లీలో మూడుసార్లు రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో.. ఖాళీగా తిరిగి వచ్చారన్నారు. దీనికి సంబంధించి పక్కా ఆధారాలు తన వద్ద ఉన్నాయని మహేశ్వర్ రెడ్డి చెప్పుకొచ్చారు. మూసీ అంశాన్ని ఒరిజినల్ కాంగ్రెస్ మంత్రులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని బీజేఎల్పీ నేత వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని సదరు నేతలు ఎప్పటికప్పుడు అధిష్టానానికి చెప్తున్నారని పేర్కొన్నారు. నేరుగా కొంత మంది, మెయిళ్ల ద్వారా కొంతమంది, ఇతర మార్గాల ద్వారా మరికొంత మంది చేరవేస్తున్నట్లు మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని మంత్రులు, అధిష్టానం నమ్ముతుందని.. ఇది సాధారణ ప్రజల్లోకి సైతం చేరిందన్నారు. సెలక్షన్, కలక్షన్, కరప్షన్ అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధానమని కాంగ్రెస్ హైకమాండ్‌కు ఆధారాలతో సహా వెళ్లినట్లు తమకు పక్కా సమాచారం ఉందన్నారు మహేశ్వర్ రెడ్డి. మూసీ, హైడ్రా మీద కాంగ్రెస్ అధిష్టానానికి అనేక అనుమానాలు ఉన్నాయని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి.. వైఎస్ఆర్ కంటే ప్రమాదకరం అనే భావనలో కాంగ్రెస్ హైకమాండ్ ఉందన్నారు. రేవంత్ రెడ్డి సెల్ఫ్ ఎజెండా మీద మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు పూర్తి నివేదికను సోనియా గాంధీకి అందజేశారన్నారు. లక్షా యాభై వేల కోట్లతో మూసీ ప్రాజెక్టు అంశాన్ని పార్టీ అధిష్టానం వద్ద రేవంత్ రెడ్డి దాచిపెట్టారన్నారు. అనేక సందర్భాల్లో సీఎం, డిప్యూటీ సీఎం పరస్పర విరుద్ధమైన ప్రకటనలు ఇచ్చారని బీజేఎల్పీ నేత గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మూసీకి లక్షా యాభై వేల కోట్లు అని చెప్తే.. భట్టి విక్రమార్క దాన్ని ఖండించారని గుర్తు చేశారు. మూసీ, హైడ్రాల అంశంలో భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిల వ్యాఖ్యలు ఒకలా ఉంటే.. సీఎం రేవంత్ మాత్రం మరోలా మాట్లాడుతున్నారని విమర్శించారు.

### ఆ ముగ్గురిలో ఎవరో ఒకరు సీఎం..

త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి ఊడిపోవడం ఖాయం అని జోస్యం చెప్పారు బీజేఎల్పీ నేత. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలలో ఎవరో ఒకరు ముఖ్యమంత్రి అవుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక ఎమ్మెల్యేల ఫిరాయింపుల అంశం కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారిందన్నారు. కాంగ్రెస్ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌కు టచ్‌లో ఉన్నారని మహేశ్వర్ రెడ్డి చెప్పుకొచ్చారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు సైతం రేవంత్ వైఖరిపై తీవ్ర ఆగ్రహంలో ఉన్నారన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో విద్య వ్యవస్థ నాశనమైంది..

-మొదటిపేజీ తరువాయి



డైట్ కాస్మోటిక్ 40శాతం పెంచారని గుర్తుచేశారు. ఇవాళ(శుక్రవారం) తెలంగాణ సచివాలయంలో మంత్రి సీతక్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు 40శాతం చార్జీలను పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. డైట్ చార్జీలు ఏడేళ్లుగా, కాస్మోటిక్ చార్జీలు గత 16 సంవత్సరాలుగా పెరగలేదని అన్నారు. ఏడు సంవత్సరాల క్రితం డైట్ చార్జీలు కొంచెం పెంచి.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుందని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఏడేళ్లుగా ధరలు విపరీతంగా పెరిగాయని.. అందుకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ ఛార్జీలు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచకపోవడంతో పిల్లలు అర్ధాకలితో ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లు కేసీఆర్ అధికారంలో ఉండి టాయిలెట్స్ కట్టలేదని..తాగునీరు, మౌలిక వసతులు కల్పించలేదని ధ్వజమెత్తారు. ఈ సమస్యలను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పన కోసం ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి సీతక్క అన్నారు. డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో 7.65 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి జరగనుందని వివరించారు.పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టాలని పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికు ధన్యవాదాలు తెలిపారు. ఇక హాస్టల్ విద్యార్థులు అర్ధాకలితో అవస్థలు పడాల్సిన అవసరం లేదని చెప్పారు. పెంచిన చార్జీలతో విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత టీచర్లది, హాస్టల్ సిబ్బందిది అని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

## దీన్ని రాజకీయం చేయొద్దు...




కులగణన సర్వే సందర్భంగా కులం పేరును తప్పుగా నమోదు చేయించుకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ హెచ్చరించారు. కులగణన సందర్భంగా ఏ రకమైన తప్పుడు సమాచారం ఇచ్చినా... తప్పుడు సమాచారం నమోదు చేసుకున్నా చర్యలు తప్పవన్నారు. కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ... కులగణన చాలా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని కులాల సామాజిక ఆర్థిక పరిస్థితిని తెలుసుకుంటామన్నారు. దాదాపు 90 వేల ఎన్యుమరేటర్లు కులగణన ప్రక్రియలో పాల్గొంటున్నట్లు చెప్పారు. దీనిని రాజకీయం చేయవద్దని... ఎలాంటి అపోహలు సృష్టించవద్దని విజ్ఞప్తి చేశారు. కులగణనతో బీసీలే కాదు... ఎవరు ఎంతమంది ఉన్నారో లెక్క తేలుతుందని వెల్లడించారు. రిజర్వేషన్‌లో తమను వేరే గ్రూప్‌లకు మార్చాలని పలు కులాలు కోరుతున్నాయని, దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కేటీఆర్ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఏమయ్యాయో దేవుడికే తెలియాలన్నారు. జనాభాలో బీసీలు 52 శాతం ఉన్నారని చెప్పుకుంటున్నామని, అది నిరూపించడానికి ఈ సర్వే కీలకమన్నారు. కులగణనతో బీసీలతో పాటు అన్ని కులాల జానాభా లెక్కలు, వారి ఆర్థిక స్థితిగతులు తెలుస్తాయన్నారు. ఒత్తిళ్లకు లొంగకుండా తమ దృష్టికి వచ్చిన అన్ని విషయాలనూ పొందుపరుస్తామన్నారు. కులగణన నేపథ్యంలో అన్ని కుల సంఘాలు కీలక పాత్రను పోషించాలన్నారు. సర్వే సక్రమంగా జరగాలంటే అందరి సహకారం ఉండాలన్నారు. తమకు న్యాయస్థానాలపై గౌరవం ఉందని, కోర్టులు సూచించినట్లే తాము ముందుకు వెళతామన్నారు. న్యాయనిపుణుల సలహా మేరకు నవంబరు 13 వరకు ప్రజాభిప్రాయ సేకరణ కొనసాగిస్తామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో వివిధ రకాల విజ్ఞప్తులు వస్తున్నాయని, ఎప్పుడూ వినపడని కులాల పేర్లు కూడా వస్తున్నాయన్నారు. అనాథలకు ప్రత్యేక రిజర్వేషన్లు ఉండాలనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నట్లు చెప్పారు.

## సీసీటీవీ ఫుటేజ్ ద్వారా ఒక్క రోజులోనే సెల్ ఫోన్స్ రికవరీ

**పోలీస్ సిబ్బందిని ఘనంగా సన్మానించిన – బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి కోవూరి సత్యనారాయణ గౌడ్.**

**సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో సీసీటీవీ ఫుటేజ్ ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్న సిఐ మహేష్ గౌడ్ మరియు పోలీస్ సిబ్బందిని బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను అనునిత్యం కమ్యూనికేషన్ జరిపే మూడు మొబైల్ ఫోన్లు కార్లో వెళుతుండగా మార్గమధ్యంలో పడిపోవడం జరిగింది, ఇట్టి విషయంలో స్థానిక పోలీస్ కార్యాలయమును ఆశ్రయించగా సదాశివపేట సిఐ మహేష్ గౌడ్ గారి సూచనల మేరకు సీసీటీవీ ఫుటేజ్ ఇంచార్జ్ హోంగార్డ్ వీరేశం మరియు కానిస్టేబుల్ వెంకన్న సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అతి తక్కువ సమయంలో పోలీస్ ఇన్వెస్టిగేషన్ చేస్తూ ధైర్యాన్ని ఇచ్చారు. ఈ తరుణంలో అతి తక్కువ సమయంలోనే అనగా ఒక రోజులో మార్గమధ్యంలో తప్పిపోయిన మూడు మొబైల్ ఫోన్లను సీసీటీవీ ఫుటేజ్ ద్వారా మరియు వారి యొక్క కమ్యూనికేషన్ ద్వారా ఆచూకీ తెలుసుకొని సంబంధిత వ్యక్తుల నుండి మూడు మొబైల్ ఫోన్లను

## రైతుల గోడు పట్టించుకోని తెలంగాణ ప్రభుత్వం



**వాస్తవ నేస్తం,బోనకల్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల రోడ్డు పట్టించుకోవడంలేదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఇరుగుజానేషు అన్నారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రైతే రాజుగా అన్నది ఒకప్పటి మాట అని, రైతు బికారి అన్నది నేటి మాట నిలువ చేస్తుంది అనడానికి నిదర్శనమే ఖమ్మం జిల్లా మార్కెట్లో పడే వర్షం రైతు కోరుకునేది ఎప్పుడు వ్యవసాయం లాభసాటిగా మారేది ఎప్పుడు రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఎప్పుడు మార్కెట్ వ్యవస్థలో దళారులు తొలగేదెప్పుడు ఇప్పుడు తడిసిన పత్ని కొనేది ఎప్పుడు రైతు జీవితమే ప్రశ్నార్థకంగా ఉంది ప్రభుత్వం ఆదుకోవాలి రైతన్న కష్టాలను ప్రభుత్వం హక్కును చేర్చుకోవాలి రైతుని రాజుగా చేస్తే ని ఇంతవరకు రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు కనీసం రైతుకి గిట్టుబాటు ధర 2 లక్షల రూపాయలు రుణమాఫీ సబ్సిడీ మండపేటలో ఉచిత కరెంటు రైతు మహారాజు అవుతాడు ఇలా ఇవ్వాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందనన్నారు.

## సౌదీ అరేబియాలో ఉపాధ్యాయ వృత్తిలో సత్తా చాటుతున్న నిర్మల్ వాసి

**ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న సయ్యద్ ముజాహిద్ అలీ**




**వాస్తవ నేస్తం,నిర్మల్:** నిర్మల్ వాసి సౌదీ అరేబియాలో సత్తా చాటుతున్నాడు. సౌదీ అరేబియాలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై ప్రశంసలు అందుకున్నారు. జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురికి చెందిన సయ్యద్ ముజాహిద్ అలీ గత 12 సంవత్సరాల నుండి సౌదీ అరేబియాలోని ఇంటర్నేషనల్ స్కూల్లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఉత్తమ బోధనకు గాను షాహిన్ గ్రూప్ ఆఫ్ ఎక్సలెన్స్ తరపున ఆయన ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ అఫ్ ఇంచార్జి, డైరెక్టర్ ఖదీర్, ఆయస్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

# "హాస్టళ్ళలో చదివే విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచడం పట్ల హర్షం

**ఇది విద్యార్థుల పోరాట విజయం**

**బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, మాజీ రాజ్య సభ సభ్యులు ఆర్.కృష్ణయ్య**



**హైద్రాబాద్ :** రాష్ట్రంలోని హాస్టళ్ళ, గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలను పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నాం. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి – ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం బిసి భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఈ పెంపుదల గతం కంటే మంచిగా ఉంది అన్నారు. గురుకులాలు మరియు హాస్టళ్ళలో చదువుకొని 8 లక్షల 50వేల మంది విద్యార్థులకు ఈ పెంపుదల ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. కాలేజీ హాస్టళ్ళకు 1500 నుండి 2100, గురుకుల పోస్టళ్ళలో 3వ తరగతి నుండి 7వ తరగతి వరకు 950 నుండి 1330, 8వ తరగతి నుండి 10వ తరగతి కి 1100 నుండి 1540 పెంచారు. అదే విధంగా కాస్మోటిక్ చార్జీలు పెంపుదల పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేసారు. మంచిగా మెనూ తయారు చేసి పౌష్టిక ఆహారం పెట్టాలన్నారు. రాష్ట్రంలో 295 బీసీ కాలేజీ హాస్టళ్లకు, 321 బీసీ గురుకుల పాఠశాలలకు ఒకదానికి కూడా సొంత భవనాలు లేవు. కేటాయించిన ప్రభుత్వ స్థలాలను కూడా ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు అధికారులు లంచాలు తిని దారదత్తం చేస్తున్నారు. దొరల కార్లు వెళ్లడానికి మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, కోకా పేట్ లో ప్లై ఓవర్లు, స్కై ఓవర్స్ ను వేలకోట్ల రూపాయలతో వెచ్చించి కడుతున్నారు. కానీ చదువుకొని భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ లు, డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు కావల సిన విద్యార్థులను బందెల దొడ్డిలో పశువులను తొలినట్లు ఒక్కొక్క రూంలో 20 నుంచి 50 మందిని వుంచుతున్నారు. భవిష్యత్ దెబ్బ తీస్తున్నారు. చదువు దెబ్బ తింటుంది. ఆరోగ్యం దెబ్బ తింటుంది. అందుకే సొంత భవనాలు నిర్మించాలని కోరారు.

**మంచి భోజనం పెట్టాలి**

హాస్టల్ విద్యార్థుల మెస్స్ చార్జీలు పెంచినందు వలన వారికి పాట మెనూ ప్రకారం కాకుండా పోషక పదార్థాలు గల ఆహారం పెట్టాలని కృష్ణయ్య కోరారు. అలాగే కాలేజి హాస్టల్ విద్యార్థులకు కూడా నెలకు 500 ప్యాకెట్ మని ఇవ్వాలని కోరారు. ఈ సమావేశం లో బిసి సంక్షేమ సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల సుధాకర్ ముదిరాజ్,బి.సి.విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## మరిగమ్మ దేవతకు వెండి కళ్ళు బహుకరణ




**వాస్తవ నేస్తం,కోటగిరి:** మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కల మరిగమ్మ దేవతకు వెండి కళ్ళను గురువారం బహూకరించారు గ్రామానికి చెందిన కమ్మరి చిన్న గంగాధర్ జ్యోతి దంపతులు అమ్మవారికి నూతన చీరను అలంకరించి ఆ తరువాత వెండి కళ్ళను అమర్చారు భాజా భజంత్రీల మధ్య ఊరేగింపు నిర్వహించి కార్యక్రమాన్ని చేపట్టారు అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కమ్మరి చిన్న గంగాధర్ జ్యోతి దంపతులను ఘనంగా సత్కరించారు ప్రతియటా ఆలయ అభివృద్ధికి తన వంతుగా 5000 వేల రూపాయలను అందిస్తానని కమ్మరి చిన్నగంగాధర్ ప్రకటించారు అనంతరం ఆలయ కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు ఆలయ అభివృద్ధికి గ్రామంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ సభ్యులు దవులయ్య ఆర్టీసీ సాయిలు కన్నం సాయిలు కోరారు అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ కమిటీ సభ్యులను గ్రామ పెద్దలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెల్ల రవికుమార్ బర్ల భూమయ్య వడ్ల విజయ్ వడ్ల రమేష్ ఆలయ కమిటీ సభ్యులు కన్నం శ్రీనివాస్ జండా దినేష్ హస్కుల శ్రీకాంత్ పేగులాలయ్య సుధాకర్ గ్రామస్తులు కట్టు గంగాధర్ పప్పుల యోగేష్ కరెంటు భూమయ్య కట్టు సంతోష్ బొట్టే నరేందర్ కాలనీవాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# దీపావళి విషాదాలు

**వేర్వేరు ప్రమాదాల్లో 9 మంది మృతి,**

**ఉల్లిపాయ బాంబు పేలి వ్యక్తి శరీరం ఛిద్రం**




**హైదరాబాద్ :** దీపావళి పండుగ రోజున ఏపీలో తీవ్ర విషాదాలు చోటు చేసుకున్నాయి. ఏలూరులో ఓ వ్యక్తి బాణాసంచా తీసుకెళ్తుండగా భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటన నగరంలోని తూర్పు వీధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుధాకర్ అనే వ్యక్తి బైక్‌పై ఉల్లిపాయ బాంబుల బస్తా తీసుకెళ్తున్నాడు. గంగానమ్మ ఆలయం సమీపంలోకి వచ్చేసరికి రోడ్డుపై గుంత కారణంగా బైక్‌పై నుంచి బస్తా కింద పడింది. ఈ క్రమంలో భారీ పేలుడు సంభవించి అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. స్థానికులు క్షతగాత్రు లను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**విశాఖలో అగ్నిప్రమాదం**

అటు, విశాఖ జైలు రోడ్డులో ఉన్న ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్‌లో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కార్యాలయంలో మంటలు చెలరేగగా.. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని 3 ఫైరింజన్లతో మంటలు అదుపులోకి తెచ్చారు. మంటల్లో కంప్యూటర్లు, విలువైన డాక్యుమెంట్లు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, దీపావళి రోజున సెలవు కావడంతో సిబ్బంది సైతం ఎవరూ లేకపోవడం మంటలు చెలరేగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిగిన తర్వాతే వివరణ ఇస్తామని అధికారులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**రైలు ఢీకొని..**

ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని తల్లీకుమార్తెలు మృతి చెందిన ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో చోటు చేసుకుంది. శిరీష అనే మహిళ తన తల్లి వజ్రమ్మను విజయవాడ ప్యాసింజర్ రైలు ఎక్కించేందుకు కావలి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. పట్టాలు దాటుతున్న క్రమంలో వజ్రమ్మ 3వ ప్లాట్‌ఫాం ఎక్కలేకపోవడంతో.. శిరీష సాయం చేయబోయింది. ఇంతలో వేగంగా వచ్చిన కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇద్దరినీ ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రైల్వే పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**రోడ్డు ప్రమాదంలో ఐదుగురు**

మరోవైపు, గురువారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. అల్లూరి జిల్లా చింతపల్లి మండలం లంబసింగి ఘాట్ రోడ్డులో వ్యాన్, బైక్ ఢీకొని ఇద్దరు మృతి చెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అటు, ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం ఆత్కూర్ క్రాస్ రోడ్డు వద్ద జరిగిన మరో ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. లారీ, ఆటో ఢీకొని డ్రైవర్ సహా మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా.. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. లారీ డ్రైవర్ అతి వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విశాఖ జిల్లా పద్మనాభం మండలం కురపల్లి గ్రామంలో ఓ ప్రైవేటు రిసార్టులో పుట్టినరోజు వేడుకలు విషాదం నింపాయి. స్నేహితులతో కలిసి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న అభిషేక్ వంశీ (24) అనే వ్యక్తి మద్యం తాగి స్విమ్మింగ్ ఫూల్‌లో దిగి ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఎంవీపీ కాలనీగా చెందినవాడిగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ సరఫరా సౌకర్యం, ఫ్యాన్ వితరణ

**– పిల్లలకు, మహిళలకు ఉపయోగపడే పనులు చేసే అవకాశాన్ని నా అదృష్టంగా భావిస్తా : బీపీ నాయక్**



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల కేంద్రంలోని ఓ అంగన్వాడి కేంద్రానికి ఫ్యాన్ ను వితరణగా ఇచ్చిన కాంగ్రెస్ యువనేత బీపీ నాయక్. గత 20 సంవత్సరాలుగా నడుపుతున్న అంగన్వాడి కేంద్ర నిర్వాహకులు తీవ్ర ఉక్కపోతతో పిల్లలు, ఇక్కడికి వచ్చే గర్భిణీలు, బాలింతలు బాగా ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని బీపీ నాయక్ దృష్టికి తీసుకువెళ్లగా అంగన్వాడి కేంద్రానికి విద్యుత్ సరఫరా ఉందా అని అడిగారు, దీనికి నిర్వాహకులు విద్యుత్ సరఫరా కూడా లేదు చెప్పారు. 48 గంటల్లో మీ అంగన్వాడీ కేంద్రంలో ఫ్యాన్ తిరుగుతుంది అని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారమే రెండు రోజుల వ్యవధిలో ఆ అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ సరఫరాతో పాటు, ఫ్యాన్ ను అమర్చి వారికి కానుకగా ఇచ్చారని అంగన్వాడి కేంద్ర నిర్వాహకులు, మహిళలు ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయులు, సహాయకురాలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com